క్లుప్తంగా

ధాన్యం ఎగుమతులు వేగవంతం


ధాన్యం ఎగుమతులను పరిశీలిస్తున్న చైర్మన్

నేలకొండపల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాలను మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో వేగవంతం చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ధాన్యం బస్తాలను వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. కాంటాలు వేసి చాలా రోజులు అవుతుండటంతో రైతులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక లారీల ద్వారా ఎగుమతులు వేగవంతం అయ్యాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు పాల్గొన్నారు.

పాకిస్తానీలను బహిష్కరించాలి

నేలకొండపల్లి: భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలను బహిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, దుర్గారావు, ఎలిగేటి నరసింహారావు, తొగాటి నాగచారి, కల్యాణం నాగేశ్వరరావు, నాగసాయి, వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కూసుమంచి: గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని జీపీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కార్యదర్శులు సమావేశమై వారి సమస్యలపై చర్చించి పలు రావాల్సిన బిల్లులు, నిధులపై పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో తమను మినహాయించాలని, డీఎస్ఆర్, తడి, పొడి చెత్త యాప్‌లను పూర్తిగా తొలగించాలని, గ్రేడ్-4 కార్యదర్శులు ఎఫెక్టివ్ డేట్ గురించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని, నాలుగేళ్లు పూర్తిచేసిన ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను రెగ్యులైజ్ చేయాలని కోరారు.

ఆకర్షిస్తున్న వసుధ ఎగ్జిబిషన్


జ్యుయెలరీ కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్స్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకర్షిస్తోంది. ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల్లోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన గోల్డ్, సిల్వర్ జ్యుయెలరీ, చీరలు, కుర్తాలు, గృహోపకరణ సామగ్రి అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.

కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్ ప్రారంభం


జలకన్య విన్యాసాన్ని తిలకిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో స్తంభాద్రి ఎగ్జిబిషన్ ఫెయిర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కాశ్మీర్ జలకన్య ఎగ్జిబిషన్‌ను సోమవారం కార్పొరేటర్ కమర్తపు మురళి, కాంగ్రెస్ నాయకులు చావా నారాయణరావు ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో జలకన్యల విన్యాసం, జెయింట్‌వీల్, కప్‌సాసర్ తదితర వాటిని సందర్శించి మాట్లాడారు. నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, బాలశౌరి, వాసు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	రెట్రో, జింకానా
సాయిరాం	తండర్‌బోల్ట్స్
ఆదిత్య	జింకానా, అర్జున్ వైజయంతి
శ్రీనివాస	హిట్: ది థర్డ్ కేస్

- ఖమ్మంగాంధీచౌక్


సహాయకులు లేక అంబులెన్స్‌లోనే వేచిచూస్తున్న సత్తుపల్లికి చెందిన గుండెపోటు బాధితుడు

రోగుల అవస్థలు

రోగులకు సహాయకారిగా ఉండే కార్మికులు అందుబాటులో లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంబులెన్సులు, ఆటోలు, కార్లలో అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులను లోపలికి తీసుకెళ్లే వారు లేకపోవడంతో వారి వెంట వచ్చిన సహాయకులే లోపలికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సహాయకులు లేకుండా వచ్చిన రోగులు చాలాసేపు ఆస్పత్రి వెలుపలే వేచి ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


పిండిప్రోలుకు చెందిన బాధితుడిని వీల్‌చైర్‌లో ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

అలసిపోయి ఆక్రందన..

జీతాలు అందక మూడు నెలలు
- విధులు బహిష్కరించి కార్మికుల నిరసన
- పెద్దాస్పత్రిలో ఇబ్బంది పడ్డ రోగులు


మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని షెడ్డులో బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సోమవారం అర్ధాంతరంగా విధులు బహిష్కరించి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని షెడ్డులో బైఠాయించారు. పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీతాల చెల్లింపులో జాప్యం..

పెద్దాస్పత్రిలో పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీలో 259 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఓ ఏజెన్సీ నుంచి వారికి నెల నెలా జీతాలు చెల్లించాల్సి ఉండగా.. కొన్నేళ్లుగా సదరు ఏజెన్సీ పెద్దలు సక్రమంగా జీతాలు చెల్లించట్లేదు. దీంతో జీతాల కోసం తరచూ కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగుతున్నారు. మూడు నెలలుగా జీతాలు అందక అందక పస్తులు ఉండాల్సి వస్తోందని, అద్దె ఇంట్లో ఉంటున్న వారు అద్దె కట్టలేక అవమానాలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ఆస్పత్రికి రక్షణ, రోగులకు సేవలు, పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించే వరకూ తమ పోరాటం ఆగదని, ప్రతీ నెల జీతాలు అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

పెద్దాస్పత్రిలో కార్మికులు విధులు బహిష్కరించి నిరసనకు దిగడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. ఆస్పత్రిని శుభ్రపరచకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోగా.. శానిటేషన్ పనులు లేక కొన్నిచోట్ల దుర్వాసన వెదజల్లుతోంది.

వార్డు ఆఫీసర్ల బాధ్యత కీలకం


వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్ల బాధ్యతలు కీలకమని, క్షేత్రస్థాయిలో అన్ని పనులను పర్యవేక్షించే బాధ్యత వీరికి ఉంటుందని కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కేఎంసీలో వార్డు ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు, ఆదేశాలు చేశారు. ప్రతీవార్డు ఆఫీసర్‌కు కేటాయించిన రెండు డివిజన్లలో పారిశుద్ధ్య పర్యవేక్షణతో పాటు కార్మికుల హాజరు నమోదు, రిజిస్టర్లను పరిశీలించాలని ఆదేశించారు. వారంలో మూడు రోజులు ఉదయం 5 గంటలకే క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డివిజన్లలో ఏ చిన్న సమస్య అయినా ముందుగా వార్డు ఆఫీసర్ దృష్టికే తీసుకురావాలని తద్వారా పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, అభ్యర్థనలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, వాటిపై వార్డు ఆఫీసర్లు దృష్టి సారించాలని కమిషనర్ పేర్కొన్నారు.

బీసీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

ఖమ్మంఅర్బన్: అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఖమ్మం బీసీ కమ్యూనిటీ భవనాన్ని పూర్తిచేసి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలంగాణ యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం డిమాండ్ చేశారు. మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్‌కు ప్రాధాన్యతను కల్పిస్తూ మండల స్థాయిలో సదస్సులు నిర్వహించాలని, గొర్రెల సొసైటీల్లో ఉన్న నిధులపై సమగ్ర ఆడిట్ జరిపి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అలాగే, ఖమ్మం డీసీసీబీ, సుడా చైర్మన్ పదవుల తోపాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులు యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకపోతే యాదవ సంఘాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ యాదవ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య, కార్యదర్శి గుమ్మా రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ మల్సూర్, మహిళా అధ్యక్షురాలు చిత్తారి ఇందుమతి, యువజన అధ్యక్షుడు జడ మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు మీగడ రామారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి యర్రబోయిన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

రఘునాథపాలెం: విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా రఘునాథపాలెం సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణ, వ్యక్తిగత భద్రతా పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులు వివరంగా తెలిపారు. సీపీఆర్‌పై సిబ్బందికి ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. హఠాహఠిన జరిగే ప్రమాదాల సమయంలో స్పందన ఎలా ఉండాలో ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. అనంతరం మంచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.బాలకృష్ణ విద్యుత్ ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై వివరాలు అందించారు. డీఈ ఖమ్మం వీసీహెచ్ బాబూరావు, ఏడీఈ రఘునాథపాలెం ఎం.సంజీవ్‌కుమార్, ఏఈ ఎస్.శ్రీనివాసరావు, ఏఈలు జె.శంకర్, పి.సతీష్ హాజరై మాట్లాడారు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్లు, ఓ అండ్ ఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు వెంకన్న, రాయపూడి నవీన్, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, బచ్చలకూరి నాగరాజు, లక్కం ఏడుకొండలు, విజయ్, నరేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లను మూసివేయాలి


మానవహారం నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్న కార్పొరేట్ సెలూన్లను వెంటనే మూసివేయాలని, నాయీబ్రాహ్మణులను వృత్తి అభివృద్ధి పరంగా రుణాలు, రాయితీలను అందజేయాలని, దెబ్బతింటున్న వృత్తులను కాపాడాలని కోరుతూ నగరంలో సోమవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక నగర కమిటీ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ధర్నాచౌక్‌లో నిరసన సభ తలపెట్టారు. అంతకుముందు పెవిలియన్ గ్రౌండ్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించి మానవహారం నిర్వహించాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు కార్పొరేట్ సెలూన్ల వ్యవస్థకు వ్యతిరేకంగా కటింగ్ చేస్తూ వినూత్న నిరసన ప్రకటించారు. ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నాకు సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీ, ప్రజాపంథా మాస్‌లైన్ వంటి పార్టీలతో పాటు వివిధ కుల ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొని మద్దతు ప్రకటించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు ఎలమందల జగదీష్, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు నెల్లూరు కోటేశ్వరరావు, శీలం పాపారావు, సన్నే ఉదయప్రతాప్, కొత్తపల్లి రవి, గోకినపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి: పాలేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నాయకన్‌గూడెం ఫీడర్‌కు శనివారం చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు (మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తావుర్యా తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

● పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల వారీగా సంస్థాగత నిర్మాణంపై మంగళవారం పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని కూసుమంచి ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పీసీసీ పరిశీలకుడు నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొననున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, మార్కెట్, ఆత్మ, సీడీసీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరుకావాలని తెలిపారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

ఖమ్మంవన్‌టౌన్: బీసీలు, గౌడ్స్ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా గౌడ సంఘం నేతలు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడారు. కేంద్ర జనగణనతో పాటు కులగణన చేస్తామని ప్రకటించడం రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ విజయమన్నారు. అనంతరం నగరంలో నిర్మించే గౌడసంఘం భవనం నిర్మాణంపై చర్చించి నిధులు ఇప్పించేలా చూడాలని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించారు. హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, బోయినపల్లి లక్ష్మణ్‌గౌడ్, కత్తి నెహ్రూగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాలలో కామేపల్లి మండల టీడీపీ నూతన కమిటీని మహబూబాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ కొండపల్లి రామచందర్‌రావు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పుచ్చకాయల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బానోత్ దేవేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి నవీన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు సుతారపు వెంకటనారాయణ, ముద్రగడ్డ వంశీ, కొమ్మిన్ని సత్యనారాయణ, అజ్మీరా హరినాయక్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన సైదులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, నూతన పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో ఎదగాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం మామిళ్లగూడెం/కూసుమంచి: విద్యార్థులు స్పష్టమైన భవిష్యత్ లక్ష్యాలను ఎంచుకుని చదువుతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన కూసుమంచి మండలం గట్టుసింగారం, జీళ్లచెరువుకు చెందిన వాచేపల్లి భువనశ్రీ, చింతలపాటి శ్రీజ, వాచేపల్లి శిరీష రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ ఆలీ ఆధ్వర్యాన కలెక్టర్‌ను సోమవారం కలిశారు. ఈసందర్భంగా ఆయన భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశాక మాట్లాడారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడమే కాక మరికొందరికి మెళకువలు నేర్పించాలని సూచించారు. అక్కడే ఉన్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజను ఉహరిస్తూ ఆమె మాదిప్పెదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులను కలెక్టర్ సన్మానించారు. వేదిక బాధ్యులు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి స్టాల్ పరిశీలన..

ఖమ్మంవ్యవసాయం: సహజసిద్ధంగా మాగబెట్టిన మామిడి పండ్లను కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన రైతు బాణోత్ లక్ష్మణ్‌నాయక్ ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో విక్రయిస్తుండగా సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. తన క్షేత్రంలో పండించిన మామిడి పండ్లను 13 ఏళ్లుగా గ్రౌండ్‌లో విక్రయిస్తున్నట్లు తెలుసుకుని వివరాలపై ఆరా తీశారు. పెవిలియన్ గ్రౌండ్‌తో పాటు రోటరీనగర్‌లోని మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు రైతు చెప్పారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్, ఉద్యాన అధికారి అనితశ్రీ పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో 86 మందికి మంజూరైన రూ.25 లక్షల విలువైనా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు, రోడ్లు కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూభారతి ద్వారా రైతుల భూములకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యాన రైతులందరికీ రైతు భరోసా అందించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందించారు. కామేపల్లిలో అంగోత్ రమేష్ సాధు ఆధ్వర్యాన నిర్వహించిన శ్రీ బుడియా బాపు జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామేపల్లి, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మాలపాటి సత్యనారాయణ, నల్లమోతు లక్ష్మయ్య, రెడబోతు గోపీరెడ్డి, తోటకూరి శివయ్య, ఇట్టా శ్రీను, బోడా రాజేశ్‌నాయక్, మాలోత్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన మార్క్సిజం


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కారల్ మార్క్స్ ప్రతిపాదించిన మార్క్సిజం ప్రపంచ గతిని మార్చిందని, ఇప్పుడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం మార్క్సిజమేనని పెట్టుబడిదారి సమాజం సైతం అంగీకరిస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు.కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళి కోసం దోపిడీ లేని సమ సమాజం కోసం కారల్ మార్క్స్ కలలు కన్నారని, ఆ కలలను నిజం చేసేందుకు సమరశీల పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీని వినియోగించుకోండి

కూసుమంచి/ఖమ్మంరూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల కోసం రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ ఉమానగేష్ తెలిపారు. సోమవారం నుంచి మండలాల్లో రిజిస్ట్రీ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా పలు గ్రామాల్లో పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా 11 అంకెల గుర్తింపుకార్డు పొందుతారని, ఈ కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా ఉంటుందన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు తన భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ రిజిస్ట్రీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రైతు వేదికల్లో షెడ్యూల్ ప్రకారం ఏఈఓలు రిజిస్ట్రేషన్ చేస్తారని, రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, ఏఓ వాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై అసంతృప్తి

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన కొంతమంది స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా అనర్హులను ఎంపిక చేశారని.. అధికారులు స్పందించి అర్హత కలిగిన వారికి ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ, తహసీల్దార్‌కు వినతి

తిరుమలాయపాలెం: మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓలకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, నాయకులు దాసరి మహేందర్, తుళ్లూరు నాగేశ్వరరావు, కొమ్ము నాగేశ్వరరావు, గుండమల్ల ఉపేందర్, అరవయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

‘చెత్త’గా పార్కు..!


పార్కు ముఖద్వారం


పార్కులో పడేసిన చెత్త

గత నెలరోజులుగా పార్కులోని చెత్తను పడేయకపోవడంతో నగరంలోని 50వ డివిజన్‌లోని వాటర్ ట్యాంక్ బుర్హాన్‌పుర పార్కు డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తోంది. ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చే వారు చెత్తను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ తోటమాలిని నియమించగా రాత్రి అయ్యేంత వరకు అక్కడే ఉండేవారు. కాని మూడేళ్లుగా తోటమాలి లేకపోవడంతో కనీసం పార్కును సరిగా తెరిచే వారు కరువయ్యారు. కేవలం ఉదయం మాత్రమే తీస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో మద్యం బాబులు విచ్చలవిడిగా మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే వదిలేస్తున్నారు. అయినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా తోటమాలిని, వాచ్‌మెన్‌ను నియమించి చెత్తను ఎప్పటికప్పుడు అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని, మద్యంప్రియులపై నిఘా ఏర్పాటు చేయాలని ఆప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

- ఖమ్మం రాపర్తినగర్